# సాక్షి
# నల్లగొండ

శనివారం ¦ 4 ¦ నవంబర్ ¦ 2023






**'మద్దతు' సరిపోతలేదు**

నల్లగొండ ఐకేపీ కేంద్రంలో 'సాక్షి' నిర్వహించి పీపుల్స్ ఎజెండాల్లో రైతులు తమ కష్టాలను చెప్పకున్నారు. - IIలో



**కాంగ్రెస్‌కు ఇష్టం లేదు**

తెలంగాణలో అధికారంలోకి రావడం కాంగ్రెస్‌కు ఇష్టంలేకే పొత్తులు వద్దనుకుందని సీపీఎం నేతలు అన్నారు. - IIలో



**క్రీడలతో క్రమశిక్షణ**

క్రీడాపోటీలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని ఎంజీయూ ఓఎస్‌డీ రవి, ప్రొఫెసర్ అంజిరెడ్డి అన్నారు. - IIలో

## న్యూస్‌రీల్

### భూ అక్రమ క్రమబద్ధీకరణపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు ఎన్నికల సంఘం ఆదేశం

**నల్లగొండ :** నల్లగొండ పరిధిలోని పానగల్‌లో ప్రభుత్వ భూమిని అక్రమంగా క్రమబద్ధీకరించుకున్న విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని చీఫ్ ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్ కర్ణన్‌ను ఆదేశించారు. పానగల్‌లో ప్రభుత్వ భూమిని అక్రమంగా క్రమబద్ధీకరణ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని నల్లగొండ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ సభ్యులు గార్లపాటి కృష్ణారెడ్డి, గుండగోని జయశంకర్, సుధీర్, మామిడి దుర్గాప్రసాద్‌లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎన్నికల సంఘం తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది.

### రోగులకు అన్నిరకాల వైద్యసేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణన్

**నల్లగొండ:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అన్నిరకాల వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. డాక్టర్లు కూడా పీహెచ్‌సీల వారీగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆస్పత్రుల్లో డెంగీ, ఫీవర్ టెస్టులను కొనసాగించాలని సూచించారు. కోవిడ్ పేషెంట్ల వివరాలను ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండలరావు, జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు, డాక్టర్ మాత్యు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

### పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పెంపు

**నల్లగొండ:** మార్చి 2024లో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పొడిగించినట్టు డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీలోగా రూ.125 పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. డిసెంబర్ 1వ తేదీలోపు రూ.50 అపరాధ రుసుం, డిసెంబర్ 11వ తేదీ లోపు రూ.200 అపరాధ రుసుం, డిసెంబర్ 20వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చని తెలిపారు. 3 సబ్జెక్టులు ఉన్న సప్లిమెంటరీ విద్యార్థులు రూ.110 చెల్లించాలని అంతకంటే ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.125 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులు రూ.60 చెల్లించాలని తెలిపారు.

### విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశంలో సమస్యలను వివరిస్తున్న రైతు రాంరెడ్డి

**నల్లగొండ:** వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ట్రాన్స్‌కో నల్లగొండ డీఈ వెంకటేశ్వర్లు అన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన ముత్తమ్మ తన ఇంటికి కొత్త మీటర్ కావాలని ఏడాది క్రితం అడిగితే రూ.4 వేలు తీసుకుని ఇతరులు వాడిన మీటర్‌ను బిగించారని.. దీంతో విద్యుత్ బిల్లు ఎక్కువగా వస్తుందని ఎన్నిసార్లు చెప్పినా మార్చడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన డీఈ మాట్లాడుతూ సదరు మహిళ ఇంటికి 24 గంటల్లోగా కొత్త మీటర్ బిగించాలని, ఫిర్యాదు చేసినా పట్టించుకోని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాంరెడ్డి అనే రైతు కోరారు. కొన్నిచోట్ల మీటర్లు అధిక రీడింగ్ వస్తున్నాయని, మరికొన్ని చోట్ల మీటర్లు ఆగిపోయాయని, పోల్స్ మార్పిడి చేయాలని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ట్రాన్స్ టెక్నికల్ డీఈ రవిశర్మ, ఏడీఈలు డి.శంకరయ్య, సత్యనారాయణ, ఏఈలు పాల్గొన్నారు.

# తొలిరోజు..16



ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ నల్లగొండ అభ్యర్థి రామరాజు యాదవ్ తరఫున నామినేషన్ వేస్తున్న నాయకులు



నిడమనూరులో ఆర్‌ఓ కార్యాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ కర్ణన్

**ఎన్నికల నోటిఫికేషన్ విడుదల.. నామినేషన్ల స్వీకరణ ప్రారంభం**

- 9 నియోజకవర్గాల్లో 16 నామినేషన్లు దాఖలు
- మూడు నియోజకవర్గాల్లో బోణీ కాలేదు
- ఆలేరులో కాంగ్రెస్ నుంచి బీర్ల అయిలయ్య నామినేషన్
- మిగతా చోట్ల ఫార్వర్డు బ్లాక్, ప్రజావాణి, బీఎల్ఎఫ్, యుగతులసి, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు

| 1వ రోజు నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్లు | |
|---|---|
| నల్లగొండ | 2 |
| కోదాడ | 1 |
| సూర్యాపేట | 1 |
| మునుగోడు | 3 |
| నాగార్జునసాగర్ | 1 |
| నకిరేకల్ | 3 |
| ఆలేరు | 2 |
| తుంగతుర్తి | 1 |
| మిర్యాలగూడ | 2 |
| భువనగిరి | - |
| హుజూర్‌నగర్ | - |
| దేవరకొండ | - |

**సాక్షి ప్రతినిధి, నల్లగొండ:** అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు శుక్రవారం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో అన్ని నియోజకవర్గాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాలకు గాను 9 సెగ్మెంట్లలో మొదటి రోజు 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మూడు నియోజకవర్గాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఆలేరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీ అయిన కాంగ్రెస్ అభ్యర్థిగా బీర్ల అయిలయ్య నామినేషన్ వేశారు. మిగతా 15 నామినేషన్లలో ఎక్కువగా చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులవి ఉన్నాయి. కోదాడ నియోజకవర్గం నుంచి ఎన్ఆర్ఐ జలగం సుధీర్ స్వతంత్ర అభ్యర్థిగా ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేశారు. అయితే, ఆయన స్వయంగా వచ్చి నామినేషన్ పత్రాలపై రిటర్నింగ్ అధికారి ఎదుట సంతకం చేసి అందజేస్తేనే పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

**నియోజకవర్గాల వారీగా..**

- నల్లగొండ నియోజకవర్గంలో మొదటి రోజు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఆలిండియా ఫార్వర్డు బ్లాక్ అభ్యర్థి పిల్లి రామరాజుయాదవ్ తరఫున ఆయన సోదరుడు పిల్లి కృష్ణంరాజు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా సూర్యాపేటకు చెందిన మారం వెంకట్‌రెడ్డి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.
- కోదాడ నుంచి ప్రజావాణి తరఫున లింగిడి వెంకటేశ్వర్లు నామినేషన్ దాఖలు చేశారు
- సూర్యాపేటలో కూడా ప్రజావాణి పార్టీ నుంచి లింగిడి వెంకటేశ్వర్లు నామినేషన్ వేశారు.
- మునుగోడు నియోజకవర్గం నుంచి ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అందులో బేరి వెంకటేశం, మాదగోని వెంకటేశ్వర్లు, బుషిపాక వెంకటయ్య ఉన్నారు.
- నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గాదె సైదిరెడ్డి నామినేషన్ వేశారు.
- నకిరేకల్ నుంచి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. అందులో స్వతంత్ర అభ్యర్థులు రేఖల సైదులు, చినేని లక్ష్మయ్య ఉన్నారు. బీఎల్ఎఫ్ పార్టీ తరఫున నూనె వెంకటస్వామి నామినేషన్ దాఖలు చేశారు.
- ఆలేరులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల అయిలయ్యతోపాటు యుగ తులసి పార్టీ తరఫున కందాడి మహిపాల్ నామినేషన్ దాఖలు చేశారు.
- తుంగతుర్తి నియోజకవర్గంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) అభ్యర్థిగా ఈదులూరి వీరపాపయ్య నామినేషన్ వేశారు.
- మిర్యాలగూడలో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. మల్లిడి వెంకట్‌రాంరెడ్డితోపాటు ఉషానాయక్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు.
- భువనగిరి, దేవరకొండ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో మొదటి రోజు ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదు.

**పటిష్ట బందోబస్తు**

నామినేషన్ల సందర్భంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల వెంట వచ్చిన జనాలు, వాహనాలను వంద మీటర్ల దూరంలోనే ఆపేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అధికారులు నామినేషన్లను స్వీకరించారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించండి



బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమైతరు
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**దేవరకొండ:** ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థులను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కోరారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హన్మంతు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలోనే ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో వెనుకబడిన దేవరకొండ నియోజకవర్గం నేడు బీఆర్ఎస్ హయాంలో అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క చాన్స్ అంటూ వస్తున్నారని, పొరపాటున నమ్మి అవకాశం ఇస్తే ఆగమైపోతామని పేర్కొన్నారు. రైతుబంధు డబ్బులు కూడా వాళ్ల అకౌంట్లలోకి వెళ్తాయన్నారు. దేవరకొండ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రవీంద్రకుమార్‌ను గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో హన్మంతు వెంకటేష్‌గౌడ్‌కు సముచిత స్థానం కల్పిస్తామని హామీనిచ్చారు. అనంతరం రవీంద్రకుమార్ మాట్లాడుతూ మరోమారు నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో డాక్టర్ చెరుకు సుధాకర్‌గౌడ్, కేతావత్ బీల్యానాయక్, వడ్త్య రమేష్‌నాయక్, జెడ్పీటీసీలు మారుపాకల అరుణ సురేష్‌గౌడ్, బాలునాయక్, ముత్యాల సర్వయ్య, లోకసాని తిరుపతయ్య, టీవీఎన్.రెడ్డి, చింతపల్లి సుభాష్, నాయిని సుధీర్‌రెడ్డి, నీల రవి, గోవిందు యాదవ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ, డీఆర్‌డీఓ

**కట్టంగూర్:** ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. కట్టంగూర్ మండలం అయిటిపాములలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన డీఆర్‌డీఓ కాళిందిని కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. వారివెంట డీఎం నాగేశ్వర్‌రావు, సివిల్ సప్లయ్ డీటీ జ్యోతి, ఏపీఎం చెవుగోని వినోద, వీఓఏ, సంఘం బంధం సభ్యులు ఉన్నారు.

# నల్లగొండను పట్టించుకోని కేసీఆర్



నల్లగొండలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో అభివాదం చేస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- ఒక్క రోడ్డు వేస్తేనే అభివృద్ధి చేసినట్లా..
- ఎమ్మెల్యేగా, మంత్రిగా నేను ఎన్నో పనులు చేశాను
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**నల్లగొండ:** మీ వెంకన్నగా మీ ముందుకు వస్తున్నా.. ఆశీర్వదించండి. నేను ఎమ్మెల్యేగా మంత్రిగా ఉండి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డిని 21 సార్లు నల్లగొండ తీసుకొచ్చి మహాత్మా గాంధీ యూనివర్సిటీ, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఇంకా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టానని నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలోని పద్మానగర్, రవీంద్రనగర్, 35, 36, 37 వార్డులలో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ నల్లగొండను దత్తత తీసుకుంటానని చెప్పి మూడేళ్లు పట్టించుకోలేదని, ఒక రోడ్డు వేసి ఎంతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. నల్లగొండలో తాను చేసిన అభివృద్ధే తప్ప కొత్తగా చేసిందేమీ లేదన్నారు. తన కొడుకు పేరున కాలేజీ కట్టించానని, సేవా కార్యక్రమాలు చేస్తున్నానని చెప్పారు. డాక్టర్లు, ఇంజనీర్లు చదివే వారికి సాయం చేస్తున్నానని, నల్లగొండలో ఆటో డ్రైవర్ బిడ్డకు పైలెట్ ఉద్యోగం వస్తే డబ్బులు లేకపోతే తానే సాయం చేశానని చెప్పారు. నాయకుడంటే సేవ చేయాలని, తన చేతనైంత సాయం చేస్తానని అన్నారు. పేదలకు ఇళ్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు బోయినపల్లి శ్రీనివాస్, ఇటికాల శ్రీనివాస్, మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, నంద్యాల బ్రహ్మానందరెడ్డి, అవుట రవీందర్, ఇటికాల శ్రీకాంత్, సురిగి మారయ్య, సూరెడ్డి సరస్వతి, పాదూరి మోహన్‌రెడ్డి, వంగాల అనిల్‌రెడ్డి, సుజాత, వెంకన్న, భరత్, నాంపల్లి భాగ్య పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి బ్రదర్స్‌ను ఓడిస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన లింగయ్య యాదవ్, చెరుకు సుధాకర్

- వారి నియోజకవర్గాలకు వెళ్లి ప్రచారం చేస్తా
- అన్నదమ్ములవి విలువలు లేని రాజకీయాలు
- నకిరేకల్ బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య

**నకిరేకల్ :** విలువలతో కూడిన రాజకీయం చేస్తే సమాజం గౌరవిస్తుందని, దిక్కుమాలిన రాజకీయాలు చేస్తే ప్రజలు అసహ్యించుకుంటారని నకిరేకల్ బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ కోమటిరెడ్డి బ్రదర్స్‌పై ఘాటైన విమర్శలు చేశారు. 'అందరం ఒకటే ఊర్లో పుట్టి పెరిగినోళ్లం.. నేను 1995లో రాజకీయాల్లోకి వచ్చాను. ఎమ్మెల్యే స్థానం ఎస్సీ రిజర్వు కావడంతో నాకు అవకాశం వచ్చింది. ఆనాడు మీ సహకారం తీసుకున్నా. మీకు మాకు రాజకీయ విభేదాలు లేవు. రాజకీయ పరిస్థితుల వల్ల, నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారాను. ఆనాడు మీరు, మేము కలిసి టీఆర్ఎస్‌లోకి వెళ్దామని నిర్ణయానికి వచ్చాం. కానీ, మీ కోతి చేష్టల వల్ల సీఎం కేసీఆర్ మీమ్మల్ని తీసుకోలేదు' అని లింగయ్య అన్నారు. తాను ఓడిపోయిన తర్వాత తన మీద కొందరు దాడులు చేయాలనే ప్రయత్నాలు చేశారని, కార్యకర్తలపై కేసులు పెట్టించారని అన్నారు. సీఎం పిలుపు మేరకు కొంత మంది సంప్రదించి నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారానని చెప్పారు. గతంలో మీకు వ్యతిరేకంగా పనిచేసిన వేముల వీరేశంను ఇప్పుడు వెంట వేసుకుని తిరుగుతూ విలువలు లేని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కోమటిరెడ్డి సోదరులను నల్లగొండ జిల్లా నుంచి తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. నల్లగొండలో, మునుగోడులో కోమటిరెడ్డి బ్రదర్స్‌ను సైలెంట్ ఓటుతో ఓడిస్తానని అన్నారు. తన కార్యకర్తలు ఇక్కడ ప్రచారం చేస్తారు.. నేను వారి నియోజకవర్గాలకు వెళ్లి వారి ఓటమి కోసం ప్రచారం చేస్తా అన్ని చిరుమర్తి లింగయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, సీనియర్ నాయకుడు చెరుకు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్
- వ్యయ పరిశీలకులతో రిటర్నింగ్ అధికారి కార్యాలయాల తనిఖీ



మిర్యాలగూడ ఆర్‌ఓ కార్యాలయంలో మాట్లాడుతున్న కర్ణన్



హాలియా : పులిమామిడి వద్ద రిజిస్టర్లను పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకుడు, కలెక్టర్

**దేవరకొండ, నిడమనూరు, మిర్యాలగూడ, హాలియా:** ఎన్నికల విధులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. దేవరకొండ, నిడమనూరులోని నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాలను శుక్రవారం ఆయన ఎన్నికల వ్యయ పరిశీలకులు సతీష్ గురుమూర్తి, ఎండీ నింజేతో కలిసి పరిశీలించారు. తొలి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పర్యవేక్షించారు. అభ్యర్థులు తమ నామినేషన్లు సమర్పించే సమయంలో ఆర్‌ఓ కేంద్రంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్ప్ డెస్క్, ఎన్నికల వ్యయ పరిశీలన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే మిర్యాలగూడలో నామినేషన్ కేంద్రాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకుడు డీఎం నింజే, జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ వేర్వేరుగా పరిశీలించారు. ఎఫ్ఎస్‌టీ, వీవీటీ, వీఎస్‌టీ టీం సభ్యులతో సమావేశమయ్యారు. అభ్యర్థుల ప్రచార సరళితోపాటు వారు అనుమతి పొంది వాడుతున్న ప్రచార వాహనాలతోపాటు అదనంగా వాడే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి రోజూ నివేదిక అందించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం ఎన్నికల వ్యయ పరిశీలకుడు సతీష్ గురుమూర్తి, కలెక్టర్ కర్ణన్ అనుముల (హాలియా)మండలం పులిమామిడి వద్ద స్టాటిక్ సర్వే లెన్స్ టీమ్‌ను తనిఖీ చేశారు. వారి వెంట ఆర్‌ఓలు శ్రీనివాస్, శ్రీరాములు, చెన్నయ్య, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ హరిసింగ్, ఏఆర్‌ఓలు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

### 8లోగా ఏర్పాట్లు పూర్తిచేయాలి



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తూ..

**నల్లగొండ:** ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఈ నెల 8వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములోని ఆరు నియోజకవర్గాలకు సంబంధించి జరుగుతున్న కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పటిష్ట పోలీస్ భద్రత ఉండాలన్నారు. ఆయన వెంట పీఆర్ ఎస్ఈ తిరుపతయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వరరావు ఉన్నారు.

# ఘాటెక్కిన ఉల్లి



నల్లగొండలో ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేస్తున్న వ్యాపారులు

**రూ.75కి చేరిన కిలో ధర**


- వారం క్రితం రూ.20 మాత్రమే..
- కొనలేని స్థితిలో సామాన్యులు
- దిగుబడి తగ్గడమే కారణమంటున్న వ్యాపారులు

**నల్లగొండ టౌన్:** ఉల్లి ధర ఘాటెక్కింది. వారం రోజుల నుంచి మార్కెట్‌లో ఉల్లిగడ్డల ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. వారం క్రితం మార్కెట్‌లో తెల్ల ఉల్లిగడ్డలు కిలో ధర రూ.20 నుంచి రూ.25 వరకు ఉంది. ఎర్ర ఉల్లిగడ్డ కిలో రూ.15 నుంచి రూ.20 వరకు పలికాయి. వారం నుంచి తెల్లఉల్లిగడ్డ ధర కిలో రూ.70 నుంచి రూ.75 వరకు, ఎర్రఉల్లిగడ్డ కిలో రూ.55 నుంచి రూ.60 వరకు పెరిగింది. ప్రతి వంటకంలో నిత్యం వినియోగించే ఉల్లి ధర పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఉల్లిగడ్డ లేకుండానే కూరలు ఉంటుకు తినే పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.

**సాగు విస్తీర్ణం తగ్గడంతో..**

మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తెలంగాణకు ఉల్లిగడ్డలు దిగుమతి అవుతుంటాయి. అయితే గత వానాకాలం సీజన్‌లో ఆయా రాష్ట్రాల్లో ఉల్లిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో ఉల్లికి కొరత ఏర్పడి ధరలు పెరిగిపోతున్నాయని ఉల్లిగడ్డల వ్యాపారులు పేర్కొంటున్నారు.


**ప్రభుత్వం అందజేయాలి**



ఉల్లిగడ్డల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రతి కూరలో ఉల్లిగడ్డలను వాడుతుంటాం కానీ నేటి ధరల కారణంగా వేసుకోలేని పరిస్థితి. ఉల్లిగడ్డలను ప్రభుత్వమే ఉచితంగా అందజేయాలి.

– జయమ్మ, గృహిణి, నల్లగొండ

**ధరలను తగ్గించాలి**



సామాన్య ప్రజలకు అందుబాటులో లేని ఉల్లిగడ్డల ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలి. సామాన్యుని నుంచి కోటీశ్వరుల వరకు ఉల్లిగడ్డలు అందరూ వాడతారు. ముఖ్యంగా ఉల్లి ధర పేదలకు అందుబాటులో ఉండేలా చూడాలి.

– మధుమతి, నల్లగొండ

**సబ్సిడీపై ఇవ్వాలి**



వానాకాలం సీజన్‌లో మహారాష్ట్ర, సోలాపూర్, కర్నూల్ ప్రాంతాల్లో ఉల్లిసాగు తగ్గింది. దీంతో దిగుబడి తగ్గి ఉల్లి దిగుమతి లేకపోవడంతో ధరలు పెరిగిపోయాయి. ప్రభుత్వమే సబ్సిడీపై ఉల్లిగడ్డలు సరఫరా చేయాలి.

– మణికంఠ, వ్యాపారి, నల్లగొండ

**కొనలేక పోతున్నాం**



వారం క్రితం వరకు తక్కువగా ఉన్న ఉల్లిగడ్డ ధరలు తక్కువగానే ఉన్నాయి. ప్రస్తుతంకిలో రూ.20 నుంచి రూ.75 వరకు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

– నీలమ్మ, తిమ్మన్నగూడెం, కనగల్ మండలం

● ఓటు.. కడక్



ఎన్నికల ప్రచారంలో భాగంగా నీలగిరి పట్టణంలో ఇస్త్రీ చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

● వ్యాన్ ఎక్కిన ఏనుగు

ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీలు తమ గుర్తులను వినూత్న రూపంలో ప్రచారం చేస్తున్నాయి. బీఎస్పీ పార్టీ గుర్తు అయిన ఏనుగును వ్యాన్‌పై అమర్చారు. దూరం నుంచి చూసేవారు నిజంగా ఏనుగు వ్యాన్ ఎక్కిందా అని ఆశ్చర్యానికి లోనవుతున్నారు.

– భువనగిరిటౌన్



వ్యాన్‌పై పెట్టిన ఏనుగు గుర్తు

జంగ్ తెలంగాణ

# మూడు స్థానాల్లో బి.వెల్లంల వాసుల పోటీ



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : మండలంలోని బ్రాహ్మణవెల్లంల గ్రామానికి ఓ ప్రత్యేక ఉంది. ఈ గ్రామానికి చెందిన ముగ్గురు నేతలు 2009 నుంచి వివిధ ఎన్నికల్లో పోటీలో ఉంటున్నారు. ప్రస్తుతం వీరు మూడు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారు. వారిలో కాంగ్రెస్ పార్టీ నుంచి కోమటిరెడ్డి సోదరులు నల్లగొండ, మునుగోడు స్థానాల్లో, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి నకిరేకల్‌లో చిరుమర్తి లింగయ్య బరిలో ఉంటున్నారు. వీరు గత ఎన్నికల్లోనూ వీరు ఇవే స్థానాల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. ఈ సారి కూడా ఈ ముగ్గురు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో ఉండడం విశేషం.

**వీరి రాజకీయ ప్రస్థానం ఇలా..**

- బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మొదటి నుంచి రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్నారు. ఆయన 1999 ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ అక్కడి నుంచే బరిలో నిలిచారు. 2018 ఎన్నికల్లో మినహా మిగతా నాలుగు సార్లు ఆయన గెలుపొందారు. 2019 ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి ఎంపీగా విజయం సాధించారు.
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి భువనగిరి పార్లమెంట్ బరిలో నిలిచి విజయం సాధించారు. 2014లో ఓటమి పాలయ్యారు. తర్వాత స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందారు. అనంతరం 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ తరఫున మునుగోడులో పోటీ చేసి విజయం సాధించారు. 2022లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరి ఉప ఎన్నికలో ఓటమి పాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు.
- ఇదే గ్రామానికి చెందిన చిరుమర్తి లింగయ్య 2009 శాసనసభ ఎన్నికల్లో నకిరేకల్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం ఆయన బీఆర్‌ఎస్ పార్టీ నుంచి నకిరేకల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు.

**జోరుగా ప్రచారం..**

ఎన్నికల బరిలో నిలిచిన ఈ ముగ్గురు నేతలు ఆయా నియోజకవర్గంలో వేర్వేరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గతంలో వీరంతా ఒకే పార్టీ నుంచి బరిలో ఉండడంతో ఒకరి గెలుపునకు మరొకరు కృషి చేశారు. కానీ ఈ సారి నకిరేకల్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న చిరుమర్తి లింగయ్య ఓటమికి కోమటిరెడ్డి సోదరులు కృషి చేస్తున్నారు. ఈ ముగ్గురి ఎంతమంది ఈ సారి అసెంబ్లీ మెట్లు ఎక్కుతారోనని బ్రాహ్మణవెల్లంల గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

# మద్దతు సరిపోతలేదు

ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న రైతులు నేడు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రైతుల రాతలు మాత్రం మారడం లేదు. ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరగడం.. అందుకు తగిన విధంగా ప్రభుత్వాలు మద్దతు ధర పెంచకపోవడంతో నష్టాల పాలవుతున్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ పట్టణ సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో 'సాక్షి' నిర్వహించి పీపుల్స్ ఎజెండాల్లో రైతులు తమ కష్టాలను చెప్పుకున్నారు.

ఆవుల లక్ష్మయ్య, నల్లగొండ టౌన్



- ఎరువులు, పురుగు మందుల ధరలు భారీగా పెరిగాయి
- పెట్టుబడికి.. ప్రభుత్వం ఇచ్చే ధరకు పొంతన ఉండడం లేదు
- పంటలు అమ్ముకోవడానికి సైతం అష్టకష్టాలు పడుతున్నాం
- సగం మంది రైతులకే రుణమాఫీ అయ్యింది
- వర్షాల వల్ల పంట నష్టపోతే ప్రభుత్వం పరిహారం చెల్లించాలి

'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో తమ కష్టాలు చెప్పుకున్న రైతులు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోస్తున్న రైతులు

పీపుల్స్ ఎజెండా

ప్రభుత్వం పంటలకు మద్దతు ధర పెంచాలని రైతులు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.4500, పత్తికి రూ.10 వేల వరకు చెల్లించాలని కోరుతున్నారు. సాగు పెట్టుబడులు పెరిగి మోయలేని భారం పడుతోందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకుల్లో అప్పులు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద నెలల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు కూడా సకాలంలో రాకపోవడంతో పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఒక్కోసారి ప్రకృతి ప్రకోపానికి గురైన సమయంలో ప్రభుత్వాల నుంచి కనీసం పరిహారం అందక అప్పుల్లో కూరుకుపోతున్నారు. కష్టనష్టాలకోర్చి పంటలు పండించినా అమ్ముకునేందుకు అష్టకష్టాల తప్పడం లేదు. ప్రభుత్వాలు స్పందించి వ్యవసాయ రంగాన్ని కాపాడకపోతే సాగు నుంచి తప్పుకోవడం తప్ప మరో మార్గం లేదని ఆవేదన వెలిబుచ్చారు.



కాంటా వేస్తున్న హమాలీలు

**రుణమాఫీ అమలు చేయాలి**



ప్రభుత్వం ఇప్పటి వరకు సగం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదు. దీంతో బ్యాంకుల్లో తీసుకున్న అప్పు రెండింతలు అయ్యింది. రుణమాఫీ వస్తుందన్న ఆశతో అప్పు కట్టలేదు. ఇప్పటికీ రుణమాఫీ కాలేదు. వెంటనే ప్రభుత్వం రుణమాఫీని చేసి ఆదుకోవాలి.

– బొడ్డుపల్లి నగేష్

**వెంట వెంటనే కొనుగోలు చేయాలి**



ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. రోజూ రాశులు ఎండబెట్టి, కుప్పలు దగ్గర పోస్తున్నాం. వ్యవసాయ పనులు మానేసి వడ్ల కుప్పల వద్ద కాపలా ఉంటున్నాం. వెంటనే కొనుగోలు చేస్తే ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

– జిల్లేపల్లి ఆండాలు

**పెట్టుబడి కూడా రావడం లేదు**



ఈ సారి వరిచేలకు తెగులు వచ్చి వడ్లు బాగా పండలేదు. అమ్ముకుంటే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి ముందుకు వచ్చి పరిహారం చెల్లించాలి. వడ్లు అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో ఎదురు చూడాల్సి వస్తోంది.

– పనస స్వరాజ్యం

**వర్షం వస్తే వడ్లు మొలకెత్తుతాయి**



పంటలు కోసి కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చాం. ఇప్పుడు మబ్బులు పడుతున్నాయి. వర్షం వస్తే వడ్లు తడిసి మొలకెత్తే ప్రమాదం ఉంది. కొనుగోళ్లు వెంటవెంటనే చేపట్టపోవడంతో పొద్దస్తమానం కుప్పల వద్ద కాపలా ఉండాల్సి వస్తోంది.

– జిల్లేపల్లి పద్మ

**పెట్టుబడులు పెరిగాయి**



ప్రస్తుతం వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల ధరలు బాగా పెరిగాయి. దున్నకాలు రేట్లు కూలీల ఖర్చు కూడా పెరిగింది. పంటలు సాగు చేస్తే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– జానపాటి రాజేంద్రప్రసాద్

**క్వింటాకు రూ.4500 చెల్లించాలి**



ప్రభుత్వం ధాన్యం, పత్తికి ఇస్తున్న మద్దతు ధర ఏ మూలకూ సరిపోవడం లేదు. నేడు అన్నింటికీ ధరలు పెరిగాయి. ప్రస్తుతం ఉన్న మద్దతు ధరలతో పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం ధాన్యం క్వింటాకు రూ.4500, పత్తికి రూ.10 వేల మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– దైద వెంకట్‌రెడ్డి

**బోనస్ ఇవ్వాలి**



అతివృష్టి వచ్చినా అనావృష్టి వచ్చినా నష్టపోయేది రైతులు మాత్రమే. ఇప్పుడు పంటల పెట్టుబడులు వెళ్లక అప్పుల పాలవుతున్నాం. ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ కూడా కలిపి ఇవ్వాలి. రైతులను ఆదుకోవడానికి పాలకులు చొరవ తీసుకోవాలి.

– పనస కాశయ్యగౌడ్

**అష్టకష్టాలు పడుతున్నాం**



ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అమ్ముకోడానికి అష్టకష్టాలు పడుతున్నాం. నెల రోజుల వరకు కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప ట్టాల ఖర్చు, కూలీ ఖర్చు భారంగా మారుతోంది. వెంటవెంటనే కాంటాలు వేసేలా చూడాలి.

– కేశబోయిన క్రిష్ణయ్య

# మంత్రి జగదీష్‌రెడ్డి కాన్వాయ్ తనిఖీ



మంత్రి జగదీష్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

సూర్యాపేట : రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ముమ్మరంగా తనిఖీలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కాన్వాయ్‌ని సూర్యాపేట సమీపంలోని విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిపై చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి పోలీసులకు మంత్రి జగదీష్‌రెడ్డి పూర్తిగా సహకరించారు. మంత్రి వాహనంతో పాటు వెంట ఉన్న ఇతర వాహనాలను సైతం పోలీసులు తనిఖీ చేశారు.

# గజ్వేల్‌లో మంచ్యాతండా వాసి నామినేషన్



గజ్వేల్ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేస్తున్న సుమన్‌నాయక్

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండాకు చెందిన ఉస్మానియా జేఏసీ నాయకుడు, మఠంపల్లి మండల భూపరిరక్షణ సమితి అధ్యక్షుడు సపావట్ సుమన్‌నాయక్ శుక్రవారం గజ్వేల్‌లో నామినేషన్ దాఖలు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మఠంపల్లి మండలంలోని గుర్రంబోడుతండా 540 సర్వే నంబర్‌లో గల గిరిజనుల భూ సమస్యలను పరిష్కరిస్తానని హుజూర్‌నగర్ ఉప ఎన్నిక సమయంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి ఇప్పటి వరకు చేయలేదన్నారు. తాను గతంలో కూడా తెలంగాణలోని పలు అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

# కాంగ్రెస్‌కు అధికారంలోకి రావడం ఇష్టం లేదు

- అందుకే వామపక్షాలతో తెగదెంపులు చేసుకుంది
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు పక్కన జూలకంటి

మిర్యాలగూడ: కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో అధికారంలోకి రావడం ఇష్టంలేకనే వామపక్ష పార్టీలతో పొత్తు తెగదెంపులు చేసుకుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ఉద్యమాలు జరిపే పార్టీలు కేవలం వామపక్షాలేనని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా వారి విధానాలు మారడం లేదని, ఏ ప్రభుత్వాలు కూడా ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం తాత్కాలిక పథకాలు పెట్టి ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీలు కీలకంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఒప్పుకున్న రెండు సీట్లు కూడా ఇవ్వకుండా జాప్యం చేయడంతో ఒంటరిగా పోటీ చేసేందుకు రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. సమావేశంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, లక్ష్మీనారాయణ పాలడుగు నాగార్జున, ప్రభావతి, కందాల ప్రమీల, హాషం, డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జగదీశ్‌చంద్ర, రవినాయక్, బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపత్తి రామ్మూర్తి, పరుశరాములు, వరలక్ష్మి, వినోద్‌నాయక్, ఎండీ.అంజాద్, గాదె పద్మ తదితరులు పాల్గొన్నారు.

# తనిఖీల్లో నగదు సీజ్

- గత నెల 12నుంచి ఇప్పటి వరకు రూ.33.63కోట్ల నగదు పట్టివేత

నల్లగొండ : ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టి భారీగా నగదును సీజ్ చేస్తున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుతో పాటు అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నగదు, బంగారం, వెండి వస్తువులు, ఆధారాలు లేకుండా తీసుకెళ్లే వాటిపై నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నారు. గత నెల 12వ తేదీ నుంచి ఇప్పటి వరకు చేపట్టిన తనిఖీల్లో రూ.33,63,07,930 విలువ చేసే నగదుతో పాటు విలువైన బంగారు, వెండి వస్తువులను పట్టుకుని సీజ్ చేశారు. సీజ్ చేసిన వాటిలో ఇప్పటి వరకు అన్ని ఆధారాలు చూపించిన రూ.33,39,29,930లకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులు రిలీజ్ చేశారు. ఇంకా రూ.23లక్షల 78వేల నగదు, ఇతర వస్తువులను రిలీజ్ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు మొత్తం రూ.12,42,63,590 నగదును సీజ్ చేయగా, ఇతర రూ.27,94,72,193 విలువ చేసే బంగారం, వెండి వస్తువులను సీజ్ చేశారు. అదే విధంగా ఇప్పటి వరకు రూ.కోటి 18లక్షల994 విలువ చేసే మద్యాన్ని సీజ్ చేసి 1132 కేసులు నమోదు చేసి 466మందిని అరెస్టు చేశారు. కాగా 369 బెల్టుషాపులను మూసివేశారు.

# కార్తీకమాసంలో పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

- నల్లగొండ ఆర్‌ఎం ఎస్.శ్రీదేవి

భానుపురి, నల్లగొండ రూరల్ : కార్తీకమాసం సందర్భంగా ఉమ్మడి జిల్లావాసులకు పలు క్షేత్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు నల్లగొండ ఆర్‌ఎం ఎస్.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ నుంచి పంచారామాలు (5పుణ్య క్షేత్రాలు), డెక్కన్ శైవక్షేత్రాలు (5 పుణ్యక్షేత్రాలు), అరుణాచలం, శబరిమలకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల నుంచి ఈ బస్సులు ఉంటాయని తెలిపారు. దేవరకొండ నుంచి పంచరామాలకు 12 బస్సులు, శబరిమలకు 4 బస్సులు, అరుణాచలంకు 3 బస్సులు డెక్కన్ శైవక్షేత్రానికి 3 బస్సులు, నల్లగొండ నుంచి పంచారామాలకు 15 బస్సులు, శబరిమలకు 2 బస్సులు, అరుణాచలంనకు 3 బస్సులు, డెక్కన్ శైవక్షేత్రానికి 3 బస్సులు, నార్కట్‌పల్లి నుంచి పంచారామాలకు 2 బస్సులు, శబరిమల, అరుణాచలంకు ఒక్కొక్కటి ఉంటాయని తెలిపారు. అదే విధంగా డెక్కన్ శైవక్షేత్రానికి 2 బస్సులు, మిర్యాలగూడ నుంచి పంచరామాలకు 14, శబరిమలకు 4, అరుణాచలంనకు 3, డెక్కన్ శైవక్షేత్రానికి 2, యాదగిరిగుట్ట నుంచి పంచారామాలకు 8, శబరిమలకు 2, అరుణాచలానికి 2, డెక్కన్ శైవక్షేత్రానికి 3, కోదాడ నుంచి పంచరామాలకు 8, శబరిమలకు 2, అరుణాచలంనకు 3, డెక్కన్ శైవక్షేత్రానికి 3, సూర్యాపేట నుంచి పంచరామాలకు 11 బస్సులు, శబరిమలకు 5 బస్సులు, అరుణాచలంనకు 3 బస్సులు, డెక్కన్ శైవక్షేత్రానికి 4 బస్సుల చొప్పున నడుపుతున్నామని తెలిపారు.

# అదుపుతప్పి హార్వెస్టర్ బోల్తా ..

- ప్రమాదంలో డ్రైవర్ మృతి



తెన్నరస్ మృతదేహం

గుర్రంపోడు : హార్వెస్టర్ (వరికోత మిషన్) బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జిన్నాయిచింత గ్రామ స్టేజీ సమీపంలో నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురికి చెందిన జె.తెన్నరస్(30) అనే డ్రైవర్ పదిరోజుల క్రితం వరికోత మిషన్‌తో వరికోతలు కోసేందుకు మండలానికి వచ్చాడు. అతడు మండలంలోని జిన్నాయిచింత గ్రామంలో వరికోత పూర్తయిన తర్వాత గుర్రంపోడుకు వస్తుండగా ప్రమాదవశాత్తూ మిషన్ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో డ్రైవర్ తెన్నరస్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం ఉదయం గమనించిన వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం తరలించారు. మృతుడి సోదరుడు సిలంబరస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# కాంగ్రెస్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తుంది

- శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

చిట్యాల: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని ఇస్తే తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. చిట్యాలలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జలయజ్ఞం పేరుతో కోట్లాది రూపాయల అక్రమాలకు పాల్పడిన నాయకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన సాగు నీటి ప్రాజెక్టులపై విమర్శలు చేయటం మానుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపు ఉన్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు వనమా వెంకటేశ్వర్లు, పొన్నం లక్ష్మయ్య గౌడ్, భిక్షం, నాగరాజు పాల్గొన్నారు.

# క్రీడలతో క్రమశిక్షణ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంజీయూ అధికారులు

ఎంజీయూ(నల్లగొండ రూరల్): క్రీడాపోటీలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని ఎంజీయూ ఓఎస్‌డీ రవి, ఆడిట్ సెల్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ అన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ క్యాంపస్‌లో అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలను శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. 32 క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నందున క్రీడాకారులు అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి మంచి పేరు తేవాలన్నారు. ఈ పోటీల్లో 12 మహిళ జట్లు, 13 పురుషుల జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్రీడల కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, మురళి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కాశయ్యగౌడ్

నల్లగొండ టౌన్ : తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నల్లగొండకు చెందిన నకిరే కంటి కాశయ్యగౌడ్‌ను రెండోసారి నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాశయ్యగౌడ్‌కు కటికం సత్తయ్యగౌడ్, ఎరుకల శంకర్‌గౌడ్, గోవర్ధన్ గౌడ్, నిమ్మల పిచ్చయ్య, మామిడి సత్తయ్య, సైదులుగౌడ్, రాజాగౌడ్, కృష్ణగౌడ్‌లు అభినందనలు తెలిపారు.

### నూతన కమిటీ ఎన్నిక

మర్రిగూడ : ఫొటోగ్రాఫర్స్ మండల నూతన కమిటీని శుక్రవారం మర్రిగూడ మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మద్ది రాంబాబు, ఉపాధ్యక్షుడిగా పగడాల నగేష్, ప్రధాన కార్యదర్శిగా పానగంటి తేజ, కార్యదర్శిగా మహమ్మద్ పాషా, కోశాధికారిగా వీసం గణేశ్, కార్యవర్గ సభ్యులుగా దిలీప్, మహేష్, వినోద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బకరం అశోక్, సాగర్, బండి కిశోర్, బ్రహ్మచారి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటికీ కాంగ్రెస్

నకిరేకల్ : కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశాన్ని గెలిపించాలని కోరుతూ నకిరేకల్ మున్సిపాలిటీలోని శివాజీ నగర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు కొరివి నవీన్ ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
కేతేపల్లి : నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ బొజ్జ సుందర్, బి.దయాకర్‌రెడ్డి, టి.సాగర్, టి.జితేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ ప్రచారం

మర్రిగూడ : మునుగోడు బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మేటిచందాపురం పరిధిలోని ఇందుర్తి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. చెరుకు లింగంగౌడ్, నామాపురం ఎంపీటీసీ ఊరిపక్క సరితనగేష్, గ్రామశాఖ అధ్యక్షుడు అశోక్, ఏరుకొండ అబ్బయ్య, లపంగి భిక్షం పాల్గొన్నారు.

### 'చిరుమర్తిని గెలిపించాలి '

చిట్యాల : నకిరేకల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను గెలిపించాలని కోరుతు చిట్యాల మున్సిపాలిటీలోని రెండో వార్డు, వెలిమినేడు గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, జిట్ట చంద్రకాంత్, కందాటి రమేష్‌రెడ్డి, వెలిమినేడు గ్రామ అధ్యక్షుడు అర్రూరి శ్రీశైలం, బొంతల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.
కేతేపల్లి : నకిరేకల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను గెలిపించాలని కోరుతూ ఇనుపాముల గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలత సురేష్, సర్పంచ్ జాల వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

### యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా నాగరాజు

నార్కట్‌పల్లి : యువజన కాంగ్రెస్ నార్కట్‌పల్లి పట్టణఅధ్యక్షుడిగా నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన మేడబోయిన నాగరాజు నియమితులయ్యారు. శుక్రవారం నాగరాజుకు నియామక పత్రాన్ని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అందజేశారు.

# నామినేషన్ల పర్వం ప్రారంభం

- నల్లగొండ నియోజకవర్గంలో మొదటి రోజు రెండు..
- నకిరేకల్‌లో మూడు..
- మునుగోడులో మూడు నామినేషన్లు
- నామినేషన్లు దాఖలు చేయని ప్రధాన పార్టీల అభ్యర్థులు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి మారం వెంకటరెడ్డి

నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి రోజు శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇండిపెండెంట్ అభ్యర్థిగా సూర్యాపేటకు చెందిన మారం వెంకటరెడ్డి నల్లగొండ ఆర్‌ఓ రవికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆలిండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ నుంచి పిల్లి రామరాజుయాదవ్ తరపున ఆయన సోదరుడు పిల్లి కృష్ణంరాజు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరూ నామినేషన్లు సమర్పించలేదు. ఈ నెల 7,9 తేదీల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించే అవకాశం ఉంది.

### మునుగోడులో మూడు నామినేషన్లు దాఖలు


నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి మాదగోని వెంకటేశ్వర్లు

చండూరు : ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేయగా మొదటి రోజు మునుగోడు అసెంబ్లీ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అందులో ఒక్కరు కూడా గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు లేరు. నామినేషన్లు వేసిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులే. మొదటిగా నియోజకవర్గంలోని నాంపల్లి మండలం దామెర భీమనపల్లి గ్రామానికి చెందిన భేరి వెంకటేష్, అదే మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన బుషిపాక వెంకటయ్య, మునుగోడు మండంలోని కోతులారం గ్రామానికి చెందిన మాదగోని వెంకటేశ్వర్లు చండూరులోని ఆర్‌ఓ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దామోదర్‌రావుకు నామినేషన్ పత్రాలు అందజేశారు.

### మూడు నామినేషన్లు ..

నకిరేకల్ : శాసన సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో శుక్రవారం నుంచి నకిరేకల్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నకిరేకల్‌లోని వ్యవసాయ మార్కెట్ రోడ్డును పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మార్కెట్ రోడ్డుపై పూర్తిగా రాకపోకలను నిలిపివేశారు. నామినేషన్ స్వీకరణ సమయం ముగిశాక మార్కెట్ రోడ్డుపై రాకపోకలకు అనుమతి ఇచ్చారు. తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, సహాయ రిటర్నింగ్ అధికారి ప్రసాద్ నాయక్ నేతృత్వంలో మార్కెట్ కార్యాలయం చాంబర్‌లో నామినేషన్లు స్వీకరించారు. తొలిరోజు నూనె వెంకటస్వామి బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్), రేఖల సైదులు, చినేని లక్ష్మయ్య ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. నకిరేకల్, శాలిగౌరారం సీఐలు రాజశేఖర్, రాఘవరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


ఆర్‌ఓ పాటిల్ హేమంత్ కేశవ్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న నూనె వెంకటస్వామి(బీఎల్‌ఎఫ్)


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి రేఖల సైదులు

### మద్యం పట్టివేత

నల్లగొండ క్రైం : ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వారినుంచి రూ.56 వేల విలువైన మద్యం సీసాలను పట్టుకుని సీజ్ చేసినట్లు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శంభు ప్రసాద్, ఏఈఎస్ కిషన్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం నుంచి శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సరిహద్దు రోడ్‌లో తనిఖీలు చేస్తుండగా చెన్నయ్య అనే వ్యక్తి బైక్‌పై 120 మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. అదేవిధంగా గోవిందాపురం గ్రామంలోని బెల్ట్ షాపులో తనిఖీలు చేయగా ఇద్దరు వ్యక్తుల నుంచి 39 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఎవరైన మద్యం నిల్వ ఉంచినా, అక్రమంగా సరఫరా చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు.

### రాజ్యాధికార సాధన డీఎస్‌పీతోనే సాధ్యం

మర్రిగూడ : రాష్ట్రంలో బహుజనుల రాజ్యాధికార సాధన డీఎస్‌పీ(ధర్మ సమాజ్ పార్టీ)తోనే సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు వినోద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. శనివారం మునుగోడులో డీఎస్‌పీ అధినేత విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి, రాజ్, లక్ష్మణ్, జగన్, గిరి, శంకర్, మహేష్ తదితరులు ఉన్నారు.

# రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తా

- బీఆర్‌ఎస్ నల్లగొండ అభ్యర్థి భూపాల్‌రెడ్డి


ఆరెగూడెం వద్ద పత్తి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ప్రజలు మరోసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి రెట్టింపు చేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండలంలోని ఎల్లమ్మగూడెం, ఆరెగూడెం, గోదోరిగూడెం, మామిడాల, యాపలగూడెం, ఇండ్లూరు, వెంకటాద్రిపాలెం, ఎర్రగడ్డలగూడెం, సోమోరిగూడెం, పజ్జూరు గ్రామాల్లో భూపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఎల్లమ్మగూడెం రామాలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేయించానని, గోదోరిగూడెం వద్ద రూ.4.50 కోట్లతో చెక్ డ్యామ్, మామిడాల గోదోరిగూడెం మధ్య వాగుపై వంతెన నిర్మించామని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చకిలం అనిల్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చెప్తున్న మాయ మాటలను నమ్మవద్దని, భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారం ముగించుకుని వస్తుండగా ఆరెగూడెం వద్ద పత్తి చేలల్లో పత్తి తీస్తున్న కూలీల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ప్రతులను కూలీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, జీడిపల్లి వెంకట్‌రెడ్డి, లోడంగి గోవర్ధన్, కందుల లక్ష్మయ్య, వనపర్తి నాగేశ్వరావు, ఏనుగు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక**

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపల్లి బాలకృష్ణ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తిప్పర్తి మండలం మామిడాల గ్రామంలో శుక్రవారం నల్లగొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారితోపాటు కనగల్ మండలం ఎమ్.గౌరారం గ్రామానికి చెందిన గోనె శంకర్‌రావు, సింగం ఆంజనేయులు, ఉప సర్పంచ్ శ్రవణ్‌రావు, అమ్మగూడెం గ్రామానికి చెందిన మండల పరమేష్, బాబాసాహెబ్‌గూడెంకు చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

**బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి..**

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 44వ వార్డులోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 300 మంది ముఖ్య కార్యకర్తలు శుక్రవారం నల్లగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కంచర్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బోనగిరి దేవేందర్, జనార్దన్‌రావు, మాతంగి అమర్ పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలో కత్తుల కిశోర్, కత్తుల సంపత్, వినోద్, కోటి నారాయణ, మైసయ్య, శంకరయ్య, ఇబ్రహీం, మల్లయ్య, బొల్లం వెంకన్న ఉన్నారు.

# అభివృద్ధి చేశా.. ఆశీర్వదించి గెలిపించండి

- బీఆర్‌ఎస్ నకిరేకల్ అభ్యర్థి చిరుమర్తి


నకిరేకల్ : పాలెం గ్రామంలో ఓటు అభ్యర్థిస్తున్న చిరుమర్తి లింగయ్య , చెరుకు సుధాకర్

నకిరేకల్ : నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపానని, మరోసారి తనను ఆశీర్వదించి గెలిపించాలని నకిరేకల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య కోరారు. నకిరేకల్ మండలం పాలెం, నోముల గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, చెరుకు సుధాకర్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డితో కలిసి రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ నకిరేకల్ నుంచి మూసీ వరకు నోముల మీదుగా డబుల్ రోడ్డు విస్తరణ చేపడతామని హామీ ఇచ్చారు. అయిటిపాముల లిఫ్ట్ పనులు పూర్తయితే నోముల గ్రామం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల సోమన్న, జెడ్పీటీసీ మాధ ధనలక్ష్మీ నగేష్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాసీం, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, పాలెం సర్పంచ్ కవితా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

**ఇస్మాయిల్‌పల్లిలో చిరుమర్తి ప్రచారం**

కట్టంగూర్ : మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో నకిరేకల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య శుక్రవారం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఊట్కూరు ఏడుకొండలు, జెడ్పీటీసీ తరాల బలరాములు, సర్పంచ్ వడ్డె సైదిరెడ్డి, చెరుకు నర్సింహ, రేఖల భిక్షం, అలుగుబెల్లి శేఖర్ రెడ్డి, మేడబోయిన ఆంజనేయులు, పులిగిళ్ల వెంకన్న, నాగరాజు, సాయి, సైదులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి మద్దతుగా బీఆర్‌ఎస్‌లో చేరికలు**

కేతేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు మద్దతుగానే ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నకిరేకల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం కేతేపల్లి మండలంలోని బండపాలెం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో చిరుమర్తి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌లో చేరినవారిలో వంగూరి బాబు, వంగూరి కృష్ణ, వంగూరి భాస్కర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, మారం మీనారెడ్డి, రాచకొండ సైదులు తదితరులు ఉన్నారు.

**బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక**

చిట్యాల : పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఆ వార్డు కౌన్సిలర్ జమాండ్ల జయమ్మ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో ముప్పమధుసూదన్‌రెడ్డి, ఎస్‌కె. మున్వీర్, కూరాకుల అశోక్‌తోపాటు మరికొందరు ఉన్నారు.

**కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక**

నార్కట్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పిడి కృష్ణ, పందుల రాకేష్, మంద చింటు, జీడిమెట్ల మధులతోపాటు మరో 50 మంది నకిరేకల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పుల్లెలం ముత్తయ్య, ఉప సర్పంచ్ సిరిపంగి స్వామి, నార్కట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు దోసపాటి విష్ణు, పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞాపురం రామకృష్ణ, భాస్కర్ రెడ్డి, నడింపల్లి నరేష్, గుండె రవి, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ విజయానికి సమష్టిగా పనిచేయాలి

- కాంగ్రెస్ పార్టీ మునుగోడు అభ్యర్థి రాజగోపాల్ రెడ్డి


చండూరు : రాజగోపాల్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న నాయకులు

చండూరు : మునుగోడులో కాంగ్రెస్ పార్టీ విజయానికి సమష్టిగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు మునుగోడు క్యాంపు కార్యాలయంలో రాజగోపాల్‌రెడ్డిని కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గట్టుప్పల మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్, రావుల శంకరయ్య, టీకుమట్ల శ్రీరాములు, చలమల్ల యాదగిరిరెడ్డి, నరసింహ, దొడ్డి గాలయ్య, టీకుమట్ల నగేష్, రేవెల్లి నవీన్, శ్రీనివాస్ ,శ్రీశైలం, ఎట్టయ్య, అంజద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిక**

మర్రిగూడ : మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మర్రిగూడ మండల నాయకుడు మాస చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పగడాల యాదయ్య, వెంకటంపేట బాలయ్య, గౌరై నర్సింహ, సిలివేరు చంద్రయ్య, వంపు యాదయ్య, చంద్రయ్య, యాదయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మాంసం మార్కెట్‌ను మూసి వేయిస్తా

- కాంగ్రెస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నల్లగొండలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : మున్సిపాలిటీ కేంద్రంలోని బీట్ మార్కెట్ ఆలయం ఎదురుగా నిర్మించిన మాంసం మార్కెట్‌ను మూసి వేయిస్తానని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 48వ వార్డు బీట్ మార్కెట్‌లో కోమటిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన కన్యకాపరమేశ్వరి ఆలయం ఎదుట ఇంటిగ్రేటెడ్ మాంసం మార్కెట్ ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. మార్కెట్‌ను ఏర్పాటు చేయవద్దని ఆర్యవైశ్యులు స్థానిక ఎమ్మెల్యే దగ్గరకు వెళితే వారి పట్ల అమానుషంగా వ్యవహరించారని ఆరోపించారు. తాను గెలవగానే మాంసం మార్కెట్ మూసివేయడంతో పాటు రూ.100 కోట్లతో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

### పిల్లి రామరాజు తరఫున కృష్ణంరాజు నామినేషన్

నల్లగొండ : ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ అభ్యర్థి పిల్లి రామరాజు యాదవ్ తరపున ఆయన సోదరుడు పిల్లి కృష్ణంరాజు శుక్రవారం నామినేషన్ దాఖాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గ ప్రజలు పిల్లి రామరాజు యాదవ్‌కు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. రామరాజును గెలిపించేందుక పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట నల్లగొండ జిల్లా జేఏసీ చైర్మన్ పందుల సైదులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగి రాము, బచ్చన్నగూడెం ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, జాన్‌రెడ్డి , పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

### అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి


కిశోర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

- బీఆర్‌ఎస్ తుంగతుర్తి అభ్యర్థి గాదరి కిశోర్‌కుమార్

శాలిగౌరారం : తుంగతుర్తి నియోజకవర్గంలో గడిచిన దశాబ్ద కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ పార్టీ తుంగతుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం శాలిగౌరారం మండలంలోని రామగిరి, శాలిలింగోటం, అంబారిపేట, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, ఎంపీపీ గంట లక్ష్మమ్మ, జెడ్పీటీసీ ఎర్ర రణీల, వైస్ ఎంపీపీ కందుల అనితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మురళి, వైస్‌చైర్మన్ మహేందర్‌రెడ్డి, గుండా శ్రీనివాసులు, గుజిలాల్ శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.
శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు సుమారు 20 మంది తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో దుబ్బాక సైదులు, కప్పల సురేశ్, రమేశ్, షరీఫ్, సతీష్, కృష్ణ, నాగరాజు, సైదులు, రమేశ్, రాకేశ్, నర్సింహాచారి, వెంకటేశ్ ఉన్నారు.

# అధికారంలోకి రాగానే ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

- నార్కట్‌పల్లిలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


చిట్యాల: పేరేపల్లిలో ఎన్నికల ప్రచారంలోనే నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న వీరేశం

నార్కట్‌పల్లి : బి.వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిచేసి ప్రారంభించి రైతులకు సాగునీరు అందిస్తామని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు జొన్నలగడ్డ రాజశేఖర్‌రెడ్డి, అజీజ్, కొండపాకగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మండుగుల యాదగిరిరావు, నాగేశ్వర్‌రావుతోపాటు దాదాపు 50 మంది శుక్రవారం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో బి.వెల్లంల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కొమరబోయిన మల్లేషం, వడ్డే భూపాల్‌రెడ్డి, జేరిపోతుల భారత్, ప్రజ్ఞాపురం సత్తి, తిరుగుడు యాదయ్య, శివరాజు, చలపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

**కాంగ్రెస్‌కు మద్దతివ్వాలి**

చిట్యాల : ఇచ్చిన హామీలను అమలుచేసే కాంగ్రెస్ పార్టీకి ప్రజలంతా మద్దతుగా నిలవాలని నకిరేకల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం పిట్టంపల్లి, పేరేపల్లి, ఏపూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలోగా భాగంగా పేరేపల్లి గ్రామంలో ప్రసంగిస్తుండగా మధ్యలోనే 11 గంటల 26 నిమిషాలకు ఎన్నికల నామినేషన్ పత్రాలపై వీరేశం సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పున్న కైలాస్‌నేత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అంతటి వెంకటేష్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, సర్పంచ్‌లు జనగాం రవీందర్‌గౌడ్, దేశబోయిన మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మురుగు కాల్వ నిర్మాణ పనులు ప్రారంభం

- నాన్‌ప్లాన్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు
- ముమ్మరంగా సాగుతున్న పనులు
- తీరనున్న ఏళ్లనాటి సమస్య


చండూరు-మునుగోడు ప్రధాన రహదారి వెంట నిర్మిస్తున్న మురుగు కాల్వ

మునుగోడు: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మునుగోడు-చండూరు రోడ్డులోని ప్రధాన రహదారి వెంట మురుగు కాల్వ నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మునుగోడులోని ప్రధాన రహదారులకు ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణానికి 2018వ సంవత్సరంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో అప్పటి ప్రజాప్రతినిధులు వెంటనే పనులు మొదలు పెట్టేందుకు ప్రారంభోత్సవం చేశారు. కానీ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆరు నెలల క్రితం కేవలం మునుగోడు- చౌటుప్పల్ రోడ్డుకు ఇరువైపులా మాత్రమే మురుగు కాల్వ నిర్మాణం చేపట్టారు. మిగిలిన మునుగోడు- చండూరు రోడ్డులోని కాల్వ పనులను చేపట్టలేదు. దీంతో ప్రజలు తమ ఇళ్లలో వాడిన నీరంతా రోడ్డుపై పారుతోంది. అంతే కాకుండా భారీ వర్షం కురిసినప్పుడు నీరంతా రోడ్డుపై పారుతుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అయితే పనులకు తిరిగి టెండర్ పిలిచి మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పదిహేను రోజులుగా పనులను వేగంగా చేయిస్తున్నారు.


**కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకువచ్చి..**

ప్రధాన రోడ్లకు ఇరువైపులా కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం 2018 సెప్టెంబర్ మాసంలో నాన్‌ప్లాన్ నిధుల నుంచి రూ. 50 లక్షలు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టకుండానే వదిలేశాడు. దీంతో అధికారులు మరొక కాంట్రాక్టర్ కోసం రెండు, మూడుమార్లు టెండర్లు పిలిచారు. గత జూన్ మాసంలో నూతన కాంట్రాక్టర్ పనులు దక్కించుకొని వెంటనే పనులు ప్రారంభించకపోవడంతో అధికారులు ముమ్మరంగా పనులు చేయిస్తున్నారు.

**సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు**

కాల్వలు లేకపోవడంతో వర్షం కురినప్పుడు రోడ్డుపై భాగంలో నుంచి వచ్చిన వరద నీరు రోడ్డు కింది భాగంలోని నివాస గృహాల్లోకి వెళ్తుంది. దీంతో గృహాలు మొత్తం నీట మునిగి పోతున్నాయి. ఇప్పుడు ఆ కాల్వ నిర్మాణం జరుగుతుండడంతో ఆ ఇళ్ల యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఇంటి ముందు మురుగు నిలిచేది**


చండూరు రోడ్డులో మురుగు కాల్వ లేకపోవడంతో ఇండ్లలో వాడిన మురుగు నీరు ఇంటి ముందు రోడ్డుపై నిలిచేది. అంతే కాకుండా వర్షం వస్తే దాదాపు 2 నెలల పాటు ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండేది. కాల్వ నిర్మాణం పూర్తయితే ఇక నుంచి ఆ బాధలు ఉండవు.

– దొంకలి శేఖర్, మునుగోడు

**నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తాం**

నెల రోజుల్లో పనులు పూర్తిచేయిస్తాం. గత 2018లో నిధులు మంజూరైతే అప్పుడు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయకుండా వదిలేశాడు. తిరిగి మరొక కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాం. ఆ పనులు ప్రారంభించాలని పదే పదే వెంటబడితే 15 రోజుల క్రితం ప్రారంభించి ముమ్మరంగా చేపడుతున్నాడు. ఇక నుంచి రోడ్డుపై మురుగు నీరు కన్పించదు.

– శిరీష్, ఆర్‌అండ్‌బీ జేఈ